క్లుప్తంగా

2న ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులు పూర్తవుతున్న సందర్భంగా ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. జూన్ 2న రాత్రి 8 గంటలకు డిపో నుంచి బయలుదేరి బెంగుళూరు, మైసూర్ మీదుగా 3న ఉదయం ఊటీకి చేరుతుందన్నారు. 4న ఉదయం ఊటీ నుంచి బయలుదేరి పైకార షూటింగ్ స్పాట్, మైసూర్ ప్యాలెస్, జూ పార్కు, బృందావన గార్డెన్స్ చూసుకున్న తర్వాత అదే రోజు రాత్రి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రాను పోను చార్జీ రూ.2250 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని కోరారు.

మార్కెట్ కమిటీ పదవీ కాలం పొడిగింపు

మదనపల్లె సిటీ: మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవీ కాలాన్ని పొడగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని మార్కెట్ కార్యదర్శి అభిలాష్ తెలిపారు. ఇదే కమిటీని ఆరు నెలలె పొడిగిస్తూ మార్కెట్ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కమిటీ చైర్‌పర్సన్‌గా తట్టి శారదమ్మతో పాటు డైరెక్టర్లు మళ్లీ పదవీలో కొనసాగుతారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మదనపల్లె సిటీ: స్థానిక ఆర్యవైశ్య హాస్టల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆర్థోపెడిక్స్, యూరాలజీ ఉచిత ఆరోగ్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ప్రముఖ వైద్యులు వినిత్ ఎం.ఓస్వాల్, అర్జున్, అన్‌మోల్‌లు రోగులకు పరీక్షించారు. వీరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్, నాగేంద్రప్రసాద్, గిరిధర్, అమరనాథ్, సత్యనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు పురస్కారాలు

పెద్దమండ్యం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వలంటీర్లకు పురస్కారాలను సోమవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేతుల మీదుగా అందజేస్తామని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, ఎంపీడీఓ శ్రీధర్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే మైక్రో వాటర్‌షెడ్ అమలు చేస్తున్న గ్రామాలలోని రైతులకు ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న టార్పాలిన్ పట్టలు, టమాటా క్రేట్‌లు, చాప్‌కట్టర్‌లు, పీవీసీ పైపులు ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, వలంటీర్‌లు, రైతులు హాజరుకావాలని కోరారు.

ట్రాక్టర్ ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

మదనపల్లె : ట్రాక్టర్ ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. వెలిగల్లు గ్రామానికి చెందిన పాపులమ్మ (40) ఆదివారం గ్రామానికి చెందిన ట్రాక్టర్‌లో గడ్డి మోపులు నింపుకొని వస్తుండగా ప్రమాదవశాత్తూ జారి కిందపడింది. ప్రమాదంలో పాపులమ్మ తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఔట్ పోస్టు సిబ్బంది ప్రమాద సమాచారాన్ని పెద్దమండ్యం పోలీసులకు తెలిపారు.

రాయితీ విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

పెద్దమండ్యం : రాయితీ వేరుశనగ విత్తన కాయలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాల వద్ద వేరుశనగ విత్తన కాయలు కావాల్సిన రైతులు నమోదు కోసం తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్‌ను తీసుకురావాలని చెప్పారు. 30 కేజీల వేరుశనగ కాయల బస్తా ధరను ప్రభుత్వం రూ.1674గా నిర్ణయించినట్లు తెలిపారు. రైతుకు ఉన్న పొలం ప్రామాణికంగా తీసుకొని రాయితీ వేరుశనగ కాయలు పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వాహనాల వేలం ద్వారా ఆదాయం

ములకలచెరువు: స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయం ఎదుట ఆదివారం నిర్వహించిన వాహనాలలో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరిందని ఎస్‌ఈబీ సీఐ మల్లిక తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన వాహనాల్లో భాగంగా పలు వాహనాలకు వేలం నిర్వహించారు. వేలంలో రూ.1,61,070 ఆదాయం వచ్చినట్లు సీఐ పేర్కొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పెద్దమండ్యం: పరిశుభ్రతను పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యాన్ని పొందుతారని ఫొర్డ్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ నరసింహులు అన్నారు. మండలంలోని పెద్దమండ్యం గ్రామం మిట్టమాలపల్లెలో ఆదివారం నెలసరి పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డుల ద్వారా పరిశుభ్రతపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతతోనే ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఈ సందర్భంగా సంస్థ కో ఆర్డినేటర్ అన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆటంకాలను అధిగమిస్తాం.. ఆకాంక్షలు నెరవేరుస్తాం

- మూడు నియోజక వర్గాల ప్రజల ఆకాంక్ష ముదివేడు రిజర్వాయర్
- చంద్రబాబు కుతంత్రాలను తిప్పి కొడతాం
- న్యాయ పోరాటంతో పనులు పూర్తి చేసి తీరుతాం
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి




రైతు సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రిజర్వాయర్ కోసం సంపూర్ణ మద్దతు తెల్పుతున్న భూ నిర్వాసితులు

కురబలకోట: మండలంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన ముదివేడు రిజర్వాయర్ తంబళ్లపల్లెతో పాటు పీలేరు,మదనపల్లె నియోజక వర్గాల ప్రజల ఆకాంక్ష. కుట్ర పూరితంగా ఈ రిజర్వాయర్ పనులు అడ్డుకోవడం దారుణమని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. ఆదివారం రిజర్వాయర్ వద్ద నియోజక వర్గ రైతులు, మహిళలతో పెద్ద ఎత్తున రైతు సదస్సు నిర్వహించారు. నియోజక వర్గంలోని నలు మూలల నుండి పెద్ద సంఖ్యలో రైతులతో పాటు వివిధ వర్గాల వారు విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదివేడు రిజర్వాయర్ మూడు నియోజక వర్గాలకు వరమన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసి దీనిని అడ్డుకోవడం అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. ఈ రిజర్వాయర్‌కు సంతోషంగా భూములిచ్చిన త్యాగధనులను అవమానించినట్లేనన్నారు. నియోజక వర్గ చరిత్రలో ఈరిజర్వాయర్ మహా ఘట్టమన్నారు. అంతేకాదు నియోజక వర్గానికి గుండెకాయలాంటిదన్నారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజక వర్గ రూపురేఖలు మారుతాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఇలాంటి రిజర్వాయర్‌లను ఎందుకు చేపట్టలేకపోయిందో చెప్పాలన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా వేల మందికి ఉపాధి, జీవనోపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. భావి తరాలకు భవిష్యత్తుగా నిలుస్తుందన్నారు. మాజీ సీఎం చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్ ప్రోద్బలంతో దీన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. ఇలాంటి పనులు చేయడం కన్నా అభివృద్ధికి దోహదపడి ఉంటే మూడు రిజర్వాయర్ల ప్రారంభోత్సవానికి ఆయన్ను కూడా ఆహ్వానించి ఉండేవారమన్నారు. అంతేకాదు చంద్రబాబు కోరితే శిలా ఫలకాలపై ఆయన పేరుకూడా వేసి ఉండేవారమన్నారు. రూ.759 కోట్లతో ప్రారంభమైన రిజర్వాయర్ మూడు నియోజక వర్గాల అభివృద్ధికి వారధిగా నిలుస్తుందన్నారు. హంద్రీనీవా కాలువను కూడా మూడింతలు విస్తరణ చేయడం జరుగుతుందన్నారు. 35 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందన్నారు. దాంతో పాటు కరువు నేల సస్యశ్యామలం అవుతుందన్నారు. వేల మందికి జీవనాధారం ఏర్పడుతుందన్నారు. భూ నిర్వాసితులకు కూడా వారు నచ్చిమెచ్చేలా సంతప్తికరంగా పరిహారం ఇవ్వడంతోపాటు పునరావాసం కల్పించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. బాధితులు కోరిన చోట హైవే పక్కన ఆర్ అండ్ ఆర్ కాలనీ ఇండ్లు, ఇంటి పట్టాలు ఇవ్వడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. నష్టపరిహారం కూడా త్వరలో వారి బ్యాంకు ఖాతాలకు జమ కానుందన్నారు. నియోజక వర్గంలో చెరువులు నిండుతారన్నారు. జంతు జీవాలు కూడా అభివద్ధి చెందుతాయన్నారు. బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరిగి తద్వారా వ్యవసాయం ఊపందుకుంటుందన్నారు. టీడీపీ కుట్రలను తిప్పికొట్టి బహుళార్థ సాధక రిజర్వాయర్ పనులు తిరిగి చేపట్టడానికి న్యాయ పోరాటం చేసి పనులు పూర్తి చేసి తీరుతామన్నారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు, పరిసర ప్రాంతాల బాధితులంతా చేతులెత్తి రిజర్వాయర్ కు తమ సంపూర్ణ ఆమోదం తెలపడం విశేషం. టీటీడీ సభ్యులు పోకల అశోక్‌కుమార్, వెంకటరెడ్డి, బైసాని జ్యోతి,చంద్రశేఖర్‌రెడ్డి, బి. దస్తగిరి, పూర్ణచంద్రిక, ఎస్వీఆర్, డీఆర్.ఉమాపతిరెడ్డి, అరుణమ్మ,ఖలీల్, సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి,గోపాలకృష్ణారెడ్డి, డీఆర్.విశ్వేశ్వరరెడ్డి, అంజాద్‌ఖాన్, నారాయణరెడ్డి, మైనుద్దీన్, ఎం.ప్రభాకర్ రెడ్డి, గోపి, వసంతరెడ్డి, కులదీప్ రెడ్డి, ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, చాడేశ్వర, మధు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆవేదనాకరం’ పుస్తకావిష్కరణ

మదనపల్లె సిటీ: ప్రముఖ రచయిత, రిటైర్డు ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ రంగన్న రచించిన ఆవేదనాకరం పుస్తకాన్ని ఆదివారం స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో మరసం అధ్యక్షుడు పీ.వీ. ప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రచయిత రంగన్న జీవితం అందరికీ ఆదర్శమన్నారు. తన జీవితంలోని వాస్తవ అనుభవనాలను తన రచనలో ప్రతిబింబింప చేశారన్నారు. వారు సాహిత్యంలో మరిన్ని రచనలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రచయితలు ఖిజర్‌ఖాన్, నాగరాజ, గ్రంథాలయాధికారి వసంత, సాహితీభిమానులు పాల్గొన్నారు.

రూ. 5లక్షలతో మోటారు ఏర్పాటు

పీలేరు : పట్టణంలోని పలు ప్రాంతాలకు తాగునీరు అందించడానికి ఆదివారం సదుం మండలం గార్గేయ నదిలో రూ. 5 లక్షలతో హెవీ మోటారు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార్గేయ ప్రాజెక్టు నుంచి పంపింగ్ ద్వారా పీలేరు పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ, బండ్లవంక, చిత్తూరు రోడ్డు, ఆర్టీసీ నల్లగుట్ట ప్రాంతాలకు తాగునీరు అందించడానికి కొత్త మోటారు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో ప్రసాద్ రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, వార్డుమెంబరు అబీద్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రీసర్వే నిర్వహించాలి

– ఆర్డీఓ ఎంఎస్ మురళి



సర్వే సిబ్బందికి కిట్లను పంపిణీ చేస్తున్న ఆర్డీఓ ఎంఎస్.మురళి

మదనపల్లె : సమగ్ర భూరక్ష – భూ హక్కు పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత సమగ్ర రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో ఎంఎస్.మురళి అన్నారు. ఆదివారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సర్వే సిబ్బందికి ప్రభుత్వం అందజేసిన సర్వే సామగ్రి కిట్, మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి సారిగా సమగ్ర భూరక్ష, భూహక్కులో భాగంగా రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా రెండువేల గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగతా గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి అయిందన్నారు. మొదటి విడతలో సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో ఎదుర్కొన్న సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపుతూ రెండో విడతలో మరింత పకడ్బందీగా సర్వే నిర్వహించగా ప్రభుత్వం పటిష్టచర్యలు తీసుకుందన్నారు. మదనపల్లె డివిజన్‌లో అన్ని గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశామన్నారు. మొదటి విడతలో 84 గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వే ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి, రీసర్వే కోఆర్డినేటర్ వెంకటరమణ, జిల్లా సర్వేయర్ల సంఘం అధ్యక్షులు రెడ్డెప్ప, మండల సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మంత్రి పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అబ్దుల్ కలీమ్, హబీబ్‌బాషా

వాల్మీకిపురం: ముస్లిం మైనార్టీల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని రాష్ట్ర అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పుంగనూరు పర్యటన సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, జిల్లా వక్ఫ్ కమిటీ అధ్యక్షుడు కరీముల్లా కలిశారు. హజ్ యాత్రికుల సమస్యల పరిష్కారానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జిలాని, సాహెబ్, ఆబిద్, ఫయాజ్, మౌలానా, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మా.. దీవించమ్మా..



కుండలతో జలాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

వాల్మీకిపురం: వాల్మీకిపురం గ్రామ దేవత నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం పట్టణంలోని కోనేటివీధి, నాయక్‌వీధిలోని గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గంధాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన సేవలు నిర్వహించారు. పోతురాజు విగ్రహానికి పూజలు నిర్వహించి, జాతర చాటింపు వేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహిళలు దీలు బోణాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, కమిటీ చైర్మెన్ మొగ్రంరెడ్డి రాంకుమార్ రెడ్డి, కేశవ రెడ్డి, బలరాం, విజయవర్మ, రవి, మహేష్, శివ, పులిబ్రదర్స్, పూజారి జనార్థన్, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల రద్దీతో పోటెత్తిన రెడ్డెమ్మకొండ



సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఆదివారం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతనాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. ఆలయకింది భాగంలోని దిగువ తొట్లివారిపల్లెలో పంపిణీ చేసే ఆకు పసరును సేవించిన మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు.

దాడులు చేయకుండా చట్టాలు కఠినతరం చేయాలి

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ రవికృష్ణ

మదనపల్లె : వైద్యులు, ఆసుపత్రులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చట్టాలను కఠినతరం చేయాలని ఇండియన్ మెడికల్ అసోషియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఏవీ.సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 97 ఐఎంఏ శాఖల్లో 20వేల మంది సభ్యులు ఉన్నారన్నారు. ఇటీవల కాలంలో ఆసుపత్రులు, వైద్యులపై భౌతిక దాడులు పెరిగాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్.రాజశేఖర్‌రెడ్డి వైద్యులపై దాడులను అరికట్టేందుకు 2008లో తెచ్చిన చట్టాన్ని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కఠినతరం చేయాలని కోరారు. దేశంలోని 16 రాష్ట్రాల్లో చట్టాలను కఠినంగా మార్చాలన్నారు. దాడుల్లో ఇటీవల కేరళలో డాక్టర్ వందనదాస్ హత్యకు గురికావడం శోచనీయమన్నారు. జాతీయ స్థాయి వైద్యుల రక్షణ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు ప్రవేటు ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని, అయితే ఆసుపత్రులు బలోపేతం అయ్యేలా ఆరోగ్యశ్రీనిధులు ఎప్పటికప్పుడు మంజూరు చేయాలన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా వైద్యం చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు నేషనల్ మెడికల్ కమిషన్ సూచనల మేరకు చర్యలు చేపట్టాలన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ మదనపల్లెశాఖ కార్యదర్శి ప్రశాంత్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగమ్మ జాతర

పీలేరు రూరల్ : స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో వెలసిన తిరుపతి గంగమ్మ అమ్మవారి జాతర సోమవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త నాగరాజనాయక్ తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సోమవారం రాత్రి అమ్మవారిని పుష్పపల్లకీలో ఊరేగించనున్నట్లు తెలిపారు. మంగళవారం అమ్మవారికి భక్తులు బోనాల సమర్పణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

అన్నదానం పుణ్యకార్యం

కలకడ : ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ పుణ్యమార్గం వైపు అడుగులు వేసినట్లు అవుతుందని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ ఎంపీహెచ్ ఈఓ జయరామయ్య అన్నారు. ఆదివారం ప్రపంచ ఆకలి దినోత్సవం సందర్భంగా మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెలోని పేదలకు ఇంటింటికి వెళ్లి అన్నదానం చేశారు. మేధావులు, దానగుణం కలిగిన వ్యక్తులు అన్నదానం చేయాలన్నారు.

7,582 మంది రైతులకు రైతు భరోసా

గుర్రంకొండ: మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొత్తం 7,582 మంది రైతులకు ఈ ఏడాది రైతుభరోసా మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి రత్నమ్మ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా నిధులు రూ.4,17,01,000 మంజూరు అయ్యాయన్నా రు . ఈమొత్తం ఆయా గ్రామాల రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈనెల 30న జమ అవుతుందన్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయాల వారీగా రైతుభరోసా పథకానికి అర్హులైన రైతుల జాబితాను ఆర్బీకేల్లో రైతుల కోసం అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ఆయా గ్రామాల ఆర్బీకేలకు వెళ్లి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

సరిహద్దుల్లో ఎర్ర చందనం పట్టివేత?

బి.కొత్తకోట: రాజంపేట నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గం మీదుగా కర్ణాటకకు తరలిస్తున్న ఎర్ర చందనం వాహనం పట్టుబడినట్లు తెలిసింది. శనివారం అర్ధరాత్రి రాయచోటి, గాలివీడు మీదుగా పెద్దమండ్యం, తంబళ్లపల్లె నుంచి కర్ణాటక సరిహద్దు నుంచి కర్ణాటకకు మినిలారీలో ఎర్ర చందనం దుంగలను తరలిస్తున్నారు. అనుమానం కలగకుండా పైన మామిడికాయలు, కింద దుంగలను పెట్టారు. ఈ సమాచారం అందుకున్న బి.కొత్తకోట ఎస్ఐ వాహనాన్ని వెంబడించి సరిహద్దుల్లో పట్టుకున్నట్టు తెలుస్తోంది. విలువైన దుంగలతోపాటు ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

బదిలీలకు 29 మంది దరఖాస్తు

పెద్దతిప్పసముద్రం: విద్యాశాఖలో బదిలీల ప్రక్రియ ఆరంభమైంది. ఒకే పాఠశాల, ఒకే మండలంలో ఐదేళ్లు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో దీర్ఘకాలికంగా పని చేసిన వారిలో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, హెచ్ఎంలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా ఎంఈఓలు సదరు దరఖాస్తులను పరిశీలించి జిల్లా విద్యా శాఖ అధికారులకు అప్‌లోడ్ చేశారు. మండలంలో 29 మంది టీచర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని ఎంఈఓ నారాయణ ఆదివారం పేర్కొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

వాల్మీకిపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కర్నూలు సీనియర్ సివిల్ జడ్జి దివాకర్ అన్నారు. ఆదివారం వాల్మీకిపురంలోని జీవీఎస్‌సీఎస్ మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ క్యాంపులో పాల్గొని, క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. జడ్జి మాట్లాడుతూ యువత చిన్నప్పటి నుంచే చదువుతో పాటు అన్ని క్రీడల్లోనూ పాల్గొంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ఎమ్మెల్యే నవాజ్‌బాషాను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

మదనపల్లె : వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ఆదివారం పట్టణంలో మదనపల్లె ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం శిబిరంలో వైద్య చికిత్సలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ఉచిత ఆరోగ్య శిబిరం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తానన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్, నిర్వాహకులు గిరిలు మాట్లాడుతూ బెంగళూరు మెడికేరి వివిధాస్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే న్యూరాలజీ, యూరాలజీ, ఆర్థోపెడిక్స్ విభాగానికి సంబంధించి నిపుణులైన వైద్యులచే 500 మందికి చికిత్సలు అందజేసినట్లు తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. డాక్టర్లు పరమేశ్వర్‌రెడ్డి, వినీత్, ఎం.ఓస్వాల్, అర్జున్, అన్‌మోల్‌లు రోగులకు వైద్య చికిత్సలు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పసుపులేటి రవి, గిరి, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

హోం ఎక్స్‌పో ప్రజలకు ఉపయోగకరం

మదనపల్లె అసోషియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోం ఎక్స్‌పో ప్రదర్శన ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ఆదివారం ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న హోం ఎక్స్‌పో ప్రదర్శనను సందర్శించారు. గృహ నిర్మాణ అవసరాలకు ఉపయోగించే వివిధ నిర్మాణ సామాగ్రి స్టాల్స్‌ను పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇంజనీర్లు జాకీర్, మహేంద్ర, బాలాజీ, రవీంద్రబాబు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం



మాట్లాడుతున్న క్రిష్ణమూర్తి

వాల్మీకిపురం: సమాజంలోని నిరుపేద ప్రజలను ఆదుకునేందుకే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ సత్యసాయి మందిరంలో మానవత సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మనిషి జీవితానికి పరిపూర్ణత చేకూరాలంటే కుటుంబం, స్వార్థం కాకుండా సమాజం కోసం సేవ చేయాల్సిన ధర్మం ఉందన్నారు. పచ్చదనం కార్యక్రమం కింద మొక్కలను నాటే కార్యక్రమాలను చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేశవ రెడ్డి, శంకర, నీళ్లభాస్కర్, లక్ష్మన్న, కోసూరి చంద్ర, ఆనంద శెట్టి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ క్రిష్ణయ్య

వాల్మీకిపురం: సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ క్రిష్ణయ్య అన్నారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆన్‌లైన్‌లో ఉండే మోసపూరిత యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ వంటి మోసపూరిత యాప్‌లలో డబ్బులు పెట్టుబడి పెట్టి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వారి నుంచి ఫోన్ వస్తే ఆధార్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఏటీఎం కార్డు నెంబరు, పిన్ నెంబరు వంటిని చెప్పకూడదన్నారు. అలాగే సెల్‌ఫోన్‌లకు వచ్చే సోషల్ మీడియా ద్వారా వచ్చే ఇంటర్నెట్ లింకులపై క్లిక్ చేయకూడదన్నారు. ఎవరైనా ఇంటికి తాళం వేసి ఊర్లకు వెళ్లే సమయంలో గ్రామ మహిళా పోలీసుల ద్వారా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వర రావు, ఏఎస్ఐ లీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు విస్తృతం చేయడమే లక్ష్యం



ఐక్యత చాటుతున్న నాయీబ్రాహ్మణ సాంస్కృతిక సంఘం నాయకులు

పీలేరురూరల్ : నాయీ బ్రాహ్మణుల సాంస్కృతిక కార్యక్రమాలు విస్తృతం చేయడమే తమ సంఘం లక్ష్యమని నాయీబ్రాహ్మణ సాంస్కృతిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గుడిబండ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పీలేరు పట్టణంలో ఏర్పాటు చేసిన డివిజన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ సాంస్కృతిక సంఘంలో ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చడానికి జిల్లా కార్యవర్గం కృషి చేయాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాల అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సురేష్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, డివిజన్ నాయకులు వేణుగోపాల్, భాస్కర్, శెట్టిపల్లి శంకర్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఫోర్డు సిబ్బంది

మదనపల్లె సిటీ: బాలికలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ అన్నారు. ఆదివారం మదనపల్లె మండలం ఈశ్వరమ్మ కాలనీలో నెలసరి పరిశుభ్రత వారోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బాలికల కోసం ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. యుక్తవయస్సులో బాలికల్లో వచ్చే శారీరక మార్పులు, నెలసరి గురించి తెలుసుకోవాలన్నారు. నెలసరి అనేది ప్రకృతిపరంగా జరిగే సాధారణ ప్రక్రియ అన్నారు. దీంట్లో ఎటువంటి మూఢనమ్మకాలు పాటించకూడదన్నారు. వాడిన శానిటరీ ప్యాడ్స్‌ను పూడ్చిపెట్టాలని లేకుంటే కాల్చివేయాలన్నారు. కార్యక్రమంలో ఫోర్డు సిబ్బంది రాధారాణి, అల్తాఫ్, ప్రభావతి, జలజ, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.